
# పొట్టి సూరాయమ్మ




ఏం మాటాడుతుందో బొత్తిగా అర్థంగాదు. మాసిపోయిన రేకులు (తెల్లచీరలు) కట్టుకుని సంతపేటలోంచి నడుచుకుంటా కాలవగట్టు దగ్గరకొచ్చే సూరాయమ్మ కురసగా ఉంటది. అందుకే ఆవిడ్ని పొట్టి సూరాయమ్మని కేకేస్తారంతా. ఈ మనిషీ స్థిరంగాదు మాటా స్థిరంగాదు అన్నట్టుంటది సూరాయమ్మతీరు. ఆవిడికి ఒక కూతురు పెద్దది బలభద్రపురం ఇచ్చేరు. తర్వాతోడు అబ్బు బరంపురంలో ఉంటాడు. ఆ తర్వాతోడు పొట్టోడు రాంపురంలో కాపరం.

గవళ్ళపేటలో ఉన్న చిన్న కటకటాల పెంకుటింట్లో ఉండే పొట్టి సూరాయమ్మకి పోతాపోతా పెనిమిటి చేసెళ్ళిన అప్పులు తీర్చడానికి ఆమెకొచ్చే పించను డబ్బులు ఏమాత్రం చాలవు. దాంతో రకరకాల వ్యాపారాలు చేయడం మొదలెట్టింది.

కొత్త సంతపేటలో లైబ్రరీ మేష్టారింటవతలుండే బ్రాహ్మలింటిముందు ఖాళీస్థలం అద్దెకి మాటాడుకుని చిన్న పుల్లల అడితీ పెట్టింది. వ్యాపారం చెయ్యడం రాని మనిషి, మాటాడ్డం బొత్తిగా రాని

మనిషి అవ్వడంతో వచ్చినోళ్ళకి కాటాలో పుల్లలు తూచి అమ్మడం మానేసి దారిన వెళ్తున్న పేరెడ్డిగారి భార్య లచ్చక్క, లాటావిడ్ని పిల్చి బరంపురంలో మా పెద్దోడిది చాలా పెద్ద ఉజ్జోగం. ఆడు తల్చుకుంటే మనూర్నీ మన కాలవగట్టు దగ్గరాగే బస్సులన్నీ కొనెయ్యగలడు. ఇదిగో





నువ్వేదో అనుకుంటున్నావ్‌గానీ మా పొట్టోడు అదేనే మా చిన్నోడు తక్కువోడనుకుంటున్నావా... చదువంటే అబ్బలేదుగానీ మనూరుతో పాటు ఈ చుట్టుపక్కల వూళ్ళు ఏలేసేంత పెద్ద బుర్రాడిది ఇలాగ మొదలెడ్తుంది.

వ్యాపారం పెట్టిన రెండోరోజు అడితీలో కూర్చున్న సూరాయమ్మ దగ్గరకొచ్చిన చెవిటిసత్యం ''సూరాయమ్మగారూ లాకుల కింద భోగం భాస్కరమ్మగారి ఇంటిపక్కనున్న ముసలి చింతచెట్టు పడిపోయింది. అయిదొందలు జెప్తున్నారండి చాలా ఫుల్లతూగుద్దండి మరి'' అన్నాడు.

హుషారు పెరిగింది సూరాయమ్మలో ''పద వెళ్దారి'' అనేసి అడితీ వదిలి పెట్టి బయల్దేరింది సత్యంగాడితో.

దీపాలవేళప్పుడు తిరిగొచ్చేసరికి అడితీలో పుల్ల సగానికి పైగా

మాయమయిపోయింది. ఇదేంటని చుట్టు పక్కలోళ్లని అడిగితే ''మాకు తెల్దు అంటే మాకు తెల్దు'' అన్నారు.

సూరమ్మ ఈ టైపు అదవ్వడం వల్ల సెల తిరక్కుండానే పుల్లల వ్యాపారం దివాళా దీసేసింది. ఆ పుల్లల అడితీ వ్యాపారంకోసం మాచారం ఫైనాన్సోళ్ళ దగ్గర తెచ్చిన అప్పు మిగిలిపోయింది.

కొప్పవరంలో ఎవడో ఉప్పువ్యాపారం జేసి గొప్పోడయ్యేడని విన్న సూరాయమ్మ మళ్ళీ మాచారం ఫైనాన్సోళ్ళ దగ్గరకెళ్ళింది అప్పుకోసం.

''పాతబాకీ ఇంకా తీర్చలేదు ఇప్పుడు అప్పెలాగ ఇత్తావనుకున్నావ్?'' అంటా లేచారాళ్ళు.

సర్దిచెప్పే పన్లో ఉన్న పొట్టిసూరాయమ్మని ఏమాత్రం మాటాడనియ్యకండా గయ్యిగయ్యి మంటా పైకి లేస్తున్నారాళ్ళు. జనం బాగా మూగేరు వాళ్ళ మధ్యలో కొచ్చిన తాపీ సుబ్బిరెడ్డిగారి బోదకాలు ఈరమ్మ తన కేకల్తో గొడవ సద్దుమణిగేలాగ జేసి ఫైనాన్సోళ్ళతో ''నీ పాత అప్పు తీర్చాలి అంటే తనేదన్నా కొత్త యాపారమెట్టాలి. ఇంతకు ముందు యాపారంలో సంపాయించుకుని టెక్కె (దిండు) కింద దాచుకునుంటే మీరన్న మాటలు సరిపోతాయి. కానీ అలాగవ్వలేదే యవ్వారం తను అడితీ దగ్గర లేకండా తింగిరి బింగిరిగా తిరగడంతో చాలా లాసొచ్చింది. కాబట్టొరే మీరీ సూరాయమ్మ దగ్గర పాత అప్పు రాబట్టాలంటే కొత్త అప్పు ఇచ్చి తీరాలంతే'' అని తేల్చేసింది.

ఆలోచించుకున్న ఫైనాన్సోళ్ళు మర్నాడు పొద్దున్న పొట్టిసూరాయమ్మ ఇంటికొచ్చి ఇంకో అయిదొందలిచ్చి వెళ్ళేరు.

ఆ డబ్బు తీసుకుని కాకినాడ దగ్గర చొల్లంగి వెళ్ళిన సూరాయ్యమ్మ పదిబస్తాల ఉప్పు కొని రెండెడ్ల బండిమీద వేయించుకుని అర్ధరాత్రికి ఊళ్ళోకొచ్చి ఇంటి ముందేయించి బండోడ్ని పంపేసేక లోపలికెళ్ళి ''పొద్దుట్నుంచీ ఒకటే అలుపు. దావతకి అయిదుపైసలెట్టిసోడా తాగడం కూడా కుదర్లేదు'' అనుకుంటా లోపలికెళ్ళి కుండలో నీళ్ళు తాగి పడుకుంది.

పొద్దుటే లేచేసరికి బోరున ఒకటే వర్షం. అర్ధరాత్రి మొదలైందట. ఆగకండా కొడతానే ఉంది. చలికి తట్టుకోలేక నల్లబిన్నీ దుప్పటి కప్పుకుని బయటికొచ్చి చూస్తే వర్షం నీటికి తడిసిన ఉప్పు బస్తాల్లో ఉప్పు మొత్తం కరిగిపోయి ఖాళీ గోనెసంచులు మిగిల్నియ్యి.

అదంతా చూసి గొళ్ళుమన్న పొట్టి సూరాయమ్మకి అప్పిచ్చిన మాచవరం ఫైనాన్సోళ్ళు గుర్తుకొచ్చేరు. ఆ పూటకి అన్నం మానేసింది. వర్షం కాస్త తెరిపిచ్చేక రామచంద్రపురంలో రాజుగారి సినేమాహాలు కవతల రెండో పెళ్ళాంతో కాపరం ఉంటున్న చిన్నకొడుకు పొట్టోడు ఇంటికి బయల్దేరింది.

ఈలివాడపల్లిగారి హాస్టలుకవతల పచ్చగేటు ముదురు పచ్చ డైమండ్ షేపు కటకటాలింట్లో అద్దెకుంటున్న రెండోకొడుకు ఇంట్లో కొచ్చేసరికి మంచం మధ్యలో కూర్చుని రెండోపెళ్ళాం వేపిస్తున్న పకోడీల్ని స్టీలు పళ్ళెంలో పెట్టుకు లాగిస్తా కనిపించేడు.

వాడ్ని చూసిన వెంటనే పాటిమట్టిగోడలు పగుళ్ళొచ్చేలాగ అరుస్తా ''అసలు తల్లిని బాగా చూస్కోవాలన్న జ్ఞానం ఉందిరా నీకు? చెట్టో సెంబాకారీ ఎదవా వూళ్ళో మీ నాన్న చేసిపోయిన అప్పులు తీర్చలేక నేనెన్ని అవస్థలు పడ్తున్నానో తెల్సా నీకు?'' అంటా అరవడం మొదలెట్టింది.

తల్లిని మెత్తగా దువ్వి ''పకోడీలు తింటావా?'' అన్నాడు పొట్టోడు.

''నాకు పకోడీలు వద్దు సేగోడీలూ వద్దు. మీ నాన్న చేసెళ్ళిన అప్పులు తీర్చలేక అడ్డమైన వ్యాపారాలు మొదలెట్టి, అయ్యి చెయ్యడం చేతగాక లాసుకొని తెచ్చుకుంటున్నాను. ఇప్పుడు పగటిపూట బస్సు దిగి ఊళ్ళోకెళితే ఉప్పు పాతరేసేలాగున్నారు అప్పిచ్చినోళ్ళు'' అని గడపమీద కూలబడిపోయింది.

“అయితే ఏవంటావిప్పుడు?” చిరాకుపడ్డాడు పొట్టోడు.

“ఏవంటావేంట్రా... బరంపురంలో ఉంటున్న పెద్దోడు అబ్బు జూడు మొన్న కర్రప్పారావుగారి బాచి చేతికి రెండు వేలిచ్చి మా అమ్మ సాదరు కర్చులుకివ్వండి అన్నాడు. డాక్టరు క్రిష్ణగారింటికి ఫోన్ జేసి అమ్మా ఎలాగున్నావ్అప్పుడప్పుడూ వాస్తున్న కాలెలాగుంది...బీపీ తగ్గిందా మాత్తర్లేసు కుంటన్నావా అని అరగంట సేపు మాటాడ్తానే ఉన్నాడు. ఇక్కడ నువ్వూ ఉన్నావ్ సుకవేంటి నీ ఎదవ మొకానికి రెండోపెళ్ళికూడానూ...”అంటా రెచ్చిపోతున్న సూరాయమ్మని ఆపిన పొట్టోడు “ఆడు ఆడంత డబ్బు పంపిస్తే మరి నాదగ్గర కెందు కొచ్చేవు” అన్నాడు.

“ఏం చెయ్యను మీ నాన్న జేసిన అప్పు రూపాయీ పాపాయీనా వేలకి వేలు. ఆటికి వడ్డీలే కట్టనా వ్యాపారాల్లో లాసొస్తే చేసిన అప్పులే తీర్చనా?” అని ఎదురడిగింది.

“అయితే నువ్వేవంటావిప్పుడు?” చిరాకు పడ్డాడు పొట్టోడు.

“ఉన్న పళాన నాకో రెండువేల రూపాయిలియ్యకపోతే ఏ ఎలకలమందో ఎండ్రినో మింగేసి సచ్చిపోతాను” అని లేచి మళ్ళీ చతికిలబడిందా గడపమీద.

“నా దగ్గర అర్ధణా బిళ్ళలేదు. కావాలంటే ఇల్లంతా ఎతుక్కో” అన్నాడు.

కాదూ గూడదని ఎంత గొడవజేసినా ఒక్కరూపాయి కూడా ఇదపలేదు పొట్టోడు.

ఆడ్ని అడిగి అడిగి ఈసురో మంటా వర్షంలో తుడుచుకుంటానే నడుచుకుంటా పసలపూడెళ్ళిపోయింది.

మళ్ళీ బోదకాలు ఈరమ్మని తీసుకుని మాచారం ఫైనాన్సోళ్ళ దగ్గర కెళ్ళిన సూరాయమ్మని జూసి ఈసారి సచ్చినా ఇవ్వనన్నారు వాళ్ళు. “అది కాదురా” అని సర్ది చెపుతా “ఇప్పుడు సూరాయమ్మ నిన్ను డబ్బులడుగుతున్నది ఏ వ్యాపారమో యవ్వారమో జెయ్యడానికి కాదు. మీరు మూడొందలిస్తే పేటలో ఉంటున్న నర్సిమ్మూర్తి మనవడ్నేసుకుని బరంపురం ఉంటున్న ఈళ్ళ పెద్ద కొడుకు దగ్గరకెళ్ళి ఓ పదివేలట్టుకొస్తదట”అని వాళ్ళకి నచ్చ జెప్పేసరికి చల్దిపొద్దేళ దాటింది “సరే” అని డబ్బిచ్చారాళ్ళు.

* * *

బరంపురంలో ఉంటున్న పెద్దకొడుకు ఇల్లు పట్టుకోడానికి అడ్డమైన గడ్డీ గరిచి అష్టకష్టాలూ పడాల్సొచ్చింది. పొద్దుట రైలు దిగిన వాళ్లకి చీకటి పడే వేళప్పుడు తగిలిన ఒక తెలుగు తెల్సినోడు పెద్దకొడుకు అబ్బు ఇంటికి తీసుకెళ్ళేడు.

భార్య ముగ్గురాడపిల్లల్తో ఒరియావాడిఇంటి వెనక అద్దెకుంటున్న అబ్బుని చూసీ చూడ్డంతోనే “అసలు నీకు తల్లి అనేది ఒకర్తుంది అన్న జ్ఞానం ఉందా సెట్టో సెంబాకారీ ఎదవ” అంటా తిట్టడం మొదలెట్టింది.

అక్కడికొచ్చిన కోడలు అత్తగార్ని లోపలికి తీసుకెళ్ళబోతే విదిలించేసుకుని నిలబడ్డ సూరాయమ్మ “పెంచి సదివించి పెద్ద జేసేం... అంతే ఎగిరిపోయి ఈ ఊళ్ళో పడ్డావు” అంటా పెద్ద పెద్ద అరుపులు అరుస్తా “పది రూపాయలు మనియార్డరు జేసి ఎన్నేళ్లయ్యింది రా నువ్వు... రాంపురంలో కాపరం ఉంటున్న పొట్టోడే లేకపోతే నేనెప్పుడో పోయుందును. నిన్నటికి నిన్న సైకిలేసుకుని ఇంటికొచ్చి అయిదొందలు అరచేతిలో పెట్టి అమ్మా ఎలాగున్నావే? అప్పుడప్పుడూ వాస్తున్న కాలెగుంది? ... బీ.పీ తగ్గుతుందా మాత్తర్లేసుకుంటున్నావా అంటా నాకు చిరాకేసేదాకా పలకరిస్తానే ఉన్నాడు” అంది.

"మరాడు డబ్బిస్తే నువ్వింత దూరం ఎందుకొచ్చేవ్?" అక్కడ పొట్టోడేసిన ప్రశ్నే ఇక్కడ పెద్దోడేసేడు.

"ఏం జెయ్యమంటావ్ పోతా పోతా మీ బాబోడు జేసిన అప్పు కూస్తా కాస్తానా... ఆ అప్పులకి వడ్డీలు గట్టేసరికి రాగిడబ్బు మిగల్లేదు చేతిలో" అంటా అర్ధరాత్రి దాకా అలా గొడవ చేస్తానే మధ్య మధ్యలో పొట్టోడ్ని పొగుడుతానే ఏ తెల్లవారుఝాము వేళకో నిద్రపోయింది.

* * *

తెల్లారి నిద్రలేచేసరికి పెద్దకొడుకు అబ్బు కనిపించలేదు సూరాయమ్మ కంటికి. ఇల్లంతా వెతుకుతా "ఏడాడు?"అంది.

"అర్జంటుగా ఆళ్ళ ఫేక్టరీ పనిమీద కోరాపుట్ వెళ్ళేరు. తిరిగెళ్ళడానికి ఈ రైలు టిక్కెట్లూ దారి కర్చులకి ఈ వందా మీకిమ్మన్నారు పరిస్థితులేం బాగోలేవని చెప్పమన్నారు మీకు" అనిచ్చింది పెద్దకోడలు.

బయల్దేరిన పొట్టిసూరాయమ్మ ఊళ్ళోకి దిగగానే సైకిలు మీంచి దిగిన పొట్టోడు "ఏంటే అన్నయ్య కనిపించేడా... ఏవన్నాడు డబ్బెంతిచ్చేడు?" అన్నాడు ఆత్రంగా.

అరుగుమీద నీర్సంగా చతికిలబడి కంచుగ్లాసుడు నీళ్ళు తాగేక నోరు విప్పిన సూరాయమ్మ "ఆడిది చిన్నా చితకా ఇల్లా మూడంతస్తుల మేడ. ఇంటినిండా దాసీవోళ్ళు... ఇంట్లోకి అడుగెట్టిన నేను తిరిగి రైలెక్కేదాకా రాజమర్యాదలు చేసేరు నాకు. ఒకటా రెండా రకరకాల వంటలు... ఈ ఆరోగ్యంతో నాకేం అరుగుతయ్యా ఆ వంటలు...నువ్వూ ఉన్నావు పెట్టోసెంబాకారీ ఎదవా?" అనరిచింది.

"సరే మరి డబ్బెంతిచ్చేడంటే అది జెప్పవేం?" అన్నాడు పొట్టోడు.

"చేతికిస్తే రైల్లో దొంగలు లాగేసుకుంటారని పోస్టులో పంపిస్తానన్నాడు అసలు ఆడులేకపోతే నా జన్మేంగాను అని ఇప్పుడనిపిస్తుంది" అంటా పెద్దోడు అబ్బుని నోరెండిపోయేదాకా పొగుడుతానే ఉంది పొట్టిసూరాయమ్మ.

అలాగ చిన్నకొడుకు దగ్గరకెళ్ళినప్పుడు పెద్దకొడుకుగురించి గొప్పగానూ పెద్దకొడుకు ఇంటికెళ్ళినప్పుడు చిన్నకొడుకు గురించి గొప్పగానూ చెప్పుకుంటా పోతున్న పొట్టిసూరాయమ్మకి ఏనాడూ ఏకొడుకూ ఓ పూట కడుపునిండా అన్నం పెట్టలేదు. పదిరూపాయలనోటు తల్లి చేతిలో పెట్టి సాగనంపలేదు.

* * *